# 635

ప॥ ఎవని అతిక్రమములు మన్నింపబడెనో
పాపపరిహార మెవడొందెనో వాడే ధన్యుండు

1. యెహోవాచే నిర్దోషిగా తీర్చబడియు
ఆత్మలో కపటము లేనివాడే ధన్యుండు ॥ఎవని॥

2. మౌనినైయె యుండి దినమెల్ల నే జేసినట్టి
ఆర్తధ్వనిచే నా యెముకలు క్షీణించెను ॥ఎవని॥

3. దివారాత్రులు నీ చేయి నాపై బరువైయుండ
నా సారము వేసవిలో ఎండినట్లాయె ॥ఎవని॥

4. నేను నా దోషమును కప్పుకొనక
నీ యెదుట నా పాపమును ఒప్పుకొంటిని ॥ఎవని॥

5. నీ సన్నిధి నా పాపముల నొప్పుకొనగా
నీవు నా దోషమును మన్నించితివిగా ॥ఎవని॥

6. కావున నీ దర్శనకాలమందు
భక్తిగలవారు నిన్ను ప్రార్థించెదరు ॥ఎవని॥

7. విస్తార జలప్రవాహము పొర్లినను
నిశ్చయముగ అవి వారి మీదికి రావు ॥ఎవని॥

8. నాకు దాగుచోటు నీవే శ్రమలోనుండి
నీవు నన్ను రక్షించెదవు నాదు దుర్గమా ॥ఎవని॥

9. విమోచన గానములతో నీవు నన్ను
ఆదరించి నాకుపదేశము చేసెదవు ॥ఎవని॥

# 636

ప॥ ఎంతజాలి యేసువా యింతయని యూహించలేను ॥ఎంత॥

1. హానికరుడ హింసకుడను –దేవ దూషకుడను నేను
అవిశ్వాసినైన నన్ను ఆదరించినావుగా ॥ఎంత॥

2. రక్షకుండా నాకు బదులు – శిక్ష ననుభవించినావు
సిలువయందు సొమ్మసిల్లి – చావొందితి నాకై ॥ఎంత॥



3. ఏమి నీ కర్పింపగలను – ఏమిలేని వాడనయ్య
రక్షణంపు పాత్రనెత్తి – స్తోత్రమంచు పాడెదా ॥ఎంత॥

4. నీదు నామమునకు యిలలో – భయపడెడి వారి కొరకై
నాధుడా నీవిచ్చు మేలు – ఎంతగొప్ప దేసువా ॥ఎంత॥

5. నేను బ్రతుకు దినములన్ని – క్షేమ మెల్లవేళలందు
నిశ్చయముగ నీవు నాకు – ఇచ్చువాడా ప్రభూ ॥ఎంత॥

6. నాదు ప్రాణమునకు ప్రభువా – సేదదీర్చువాడ నీవు
నాదు కాపరివి నీవు – నాకు లేమి లేదుగా ॥ఎంత॥

7. అందరిలో అతి శ్రేష్ఠుండా – అద్వితీయుడగు యేసయ్యా
హల్లెలూయా స్తోత్రములను – హర్షముతో పాడెదా ॥ఎంత॥

# 637

ప॥ ఎంతదూరము మోయించెదరు స్వామి
కింత సిలువనెత్తి నుంతైన దయేలక ॥ఎంత॥

1. ఒంటిగా ప్రార్థించి యుపవాసములు జేసి
కంటి నిదురలేక కలతజెందిన ప్రభుని ॥ఎంత॥

2. సొమ్మునాశించి గురున్ అమ్మకొన్న యూద
నమ్మించి మీకిచ్చె నిమ్మానుయేలును ॥ఎంత॥

3. కరములు జోడించి కడకు గేత్సెమనిలో
పరమ తండ్రిని వేడు నిరపరాధిని పట్టి ॥ఎంత॥

4. పిరికి పిలాతుని బెదరించి యదలించి
యెరుషాలేం వీధుల నేసుని ద్రిప్పుచు ॥ఎంత॥

5. ఒడలలసి నా ప్రభువు తడబడుచుండగా
ఘడియ ఘడియకు తిట్టి గట్టిగ కొట్టుచు ॥ఎంత॥

6. కలువరి గిరివరకు సిలువ మోయలేక
అలసిన ప్రభుజంప నాలస్యమును చేసి ॥ఎంత॥

7. యేసు నీకొరకై నే నేడ్చుటకంటెను
దోషినని గ్రహించి దోసిలొగ్గుటె మేలు ॥ఎంత॥